క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు



జిల్లాస్థాయి విజేతలుగా నిలిచిన బాలికలు

దొనకొండ: కందుకూరు టీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌లో జిల్లా స్థాయి మొదటి, రెండో స్థానంలో దొనకొండ కేజీబీవీ విద్యార్థులు నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు కళ్యాణి తెలిపారు. నాగమల్లేశ్వరి సీనియర్స్ విభాగంలో డిస్క్ త్రో మొదటి విజయం సాధించింది. మౌనిక సీనియర్స్ విభాగంలో 400 మీ పరుగు పందెంలో రెండో విజేతగా నిలిచింది. కుర్రా నాగమణి సీనియర్స్ విభాగంలో లాంగ్ జంప్‌లో రెండో విజేతగా నిలిచింది. ఎం.సిరి చందన జూనియర్స్ విభాగంలో 400 మీ, 600 మీ పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచారు. వీరు నవంబర్ 2వ తేదీన శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కళ్యాణి తెలిపారు.

త్వరితగతిన రేషన్ పంపిణీ చేయాలి

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీప్రసన్న

ముండ్లమూరు (దర్శి): ఒకటో తేదీ నుంచి రోజూ ఒక్కో రేషన్ డీలర్ కనీసం 200 మందికైనా రేషన్ పంపిణీ చేసేలా టార్గెట్ పెట్టుకుని రేషన్ బియ్యం కార్డుదారులకు సరఫరా చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీప్రసన్న ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ప్రతి కార్డుదారునికి తప్పని సరిగా ప్రభుత్వం అందించే రేషన్‌లో అవకతవకలు లేకుండా తగు తూకం చూపించి సరఫరా చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ కలిగిన వారిదే ఉజ్వల భవిష్యత్



విద్యా బోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ

తాళ్లూరు: క్రమశిక్షణ కలిగిన వారికే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య అన్నారు. బొద్దికూరపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2024-26 విద్యా సంవత్సరానికి సంబంధించి శుక్రవారం వార్షిక తనిఖీ జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేశారు. సుబ్బయ్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. మంచి నడవడిక, అలవాట్లతో విద్యార్థులు భవిష్యత్‌లో ముందుకు సాగాలన్నారు. ఎల్.సుధాకర్‌రావు, సీఆర్‌పీ మారుతి, ప్రధానోపాధ్యాయులు శ్రీమన్నారాయణ, అబ్జర్వర్ పోలంరెడ్డి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పి. శ్రీదేవి పాల్గొన్నారు.


దేశానికి చేస్తున్న సేవ వెలకట్టలేనిది



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు: దేశానికి చేసే సేవ వెలకట్ట లేనిదని ఎస్సై మల్లికార్జునరావు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో పోలీస్ అమరవీరుల వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఓపెన్ హౌస్ ప్రోగ్రాం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జునరావు మాట్లాడుతూ జవాన్లు మన దేశానికి చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. అమరవీరులు దేశానికి వెన్నెముకలని చెప్పారు. ప్రతి ఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకుని తల్లిదండ్రులకు, దేశానికి సేవ చేయాలని సూచించారు.

కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ డీఎం నరసింహులు

మార్కాపురం: కార్తీక మాసం సందర్భంగా వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం నరసింహులు శుక్రవారం తెలిపారు. నెలరోజుల పాటు శ్రీశైలం, అరుణాచలంతోపాటు మన రాష్ట్రంలోని పంచారామాలకు కూడా ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ముందే రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. అదనపు బస్సులు కూడా ఏర్పాటు చేస్తున్నామని, ప్రస్తుతానికి 150 బస్సులను కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ పుణ్యక్షేత్రాలకు నడిపేందుకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దొంగలు బాబోయ్..దొంగలు!

- నాలుగు నెలలుగా 80 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
- పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లే దొంగల టార్గెట్
- చోద్యం చూస్తున్న అధికారులు

దర్శి:

తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలకు అడ్డే లేకుండా పోతోంది. నాలుగు నెలలుగా సుమారు 80పైగా ట్రాన్స్‌ఫార్మర్మర్‌లు దొంగలపాలైనట్లు విద్యుత్ శాఖ అధికారులే చెప్తున్నారు. ముండ్లమూరు మండలంలో 40, తాళ్లూరు మండలంలో 30పైగా ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగిలించారు. నెల నుంచి మరో 10 ట్రాన్స్‌ఫార్మర్‌లు వరకు దొంగలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్‌లు పోగొట్టుకుని రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయితే ఆ రైతుకు మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ అందాలంటే కేసులు కట్టి ఎఫ్ఐఆర్ జరిగాక ఎస్టిమేషన్ వేసి వేరొక ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలి. అయితే పంట చేతికి వచ్చే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైతే మాత్రం ఆ రైతు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ దొంగల విషయం పోలీసులకు పెను సవాల్‌గా మారింది. దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లోనే ఇప్పటి వరకు నాలుగైదు నెలలుగా 80 ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగల పాలయ్యాయంటే నియోజకవర్గంలో దొంగలు ఏ విధంగా చెలరేగిపోతున్నారో ఇట్టే చెప్పవచ్చు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అయ్యే ఖరీదు రూ.1.80 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం చేస్తే దొంగిలించిన దొంగ అందులో వచ్చే రాగి తీగను పెకిలించి అమ్మితే వచ్చే డబ్బు రూ.10 వేలు ఉండవచ్చు. ఆ పది వేల కోసం దొంగలు కక్కుర్తి రైతులకు పంట నష్టం చేయడమే కాకుండా బాగా పని చేస్తున్న లక్షల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ల రూపంలో ప్రభుత్వం భారీగా నష్ట పోవాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో కాపర్ వైండింగ్‌లు కోసం దొంగతనం చేస్తున్నారని, అల్యూమినియం వైండింగ్‌లు అల్లి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని కూడా దొంగలు వదిలి పెట్టడం లేదు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగతనాలతో రైతులు సైతం నానా తంటాలు పడుతున్నారు. పంటకు అవసరమైనప్పుడు విద్యుత్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో ఈ స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగతనాలు జరగలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దొంగతనాలు పెచ్చి మీరి పోతున్నాయి. రైతులు కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ల విషయంలో అందరూ కలిసి కట్టుగా కాపాలాలు ఉండాలని అధికారులు కూడా సూచిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దొంగల విషయంలో పోలీసులు ఇలాగే ఉదాసీనంగా ఉంటారో లేక ఇక దొంగతనాలు జరగకుండా వారి భరతం పడుతారో వేచి చూడాల్సిందే.



గొట్టిపాటి ఎత్తిపోతల పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఇలా..

గొట్టిపాటి ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ దొంగలపాలు

ముండ్లమూరు మండలం పోలవరం వద్ద నిర్మించిన గొట్టిపాటి హనుమంతరావు ఎత్తిపోతల పథకానికి చెందిన పెద్ద ట్రాన్స్‌ఫర్మర్ కొద్దిరోజుల క్రితం దొంగలు ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ తీసేసుకుని మిగిలిన పార్టులు అక్కడే పడేసి వెళ్లారు. దీంతో ఎత్తిపోతల పథకం కొనసాగాలంటే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌లు తప్పని సరిగా ఉండాలి. స్కీం కింద ట్రాన్స్‌ఫార్మర్ కావడంతో ప్రభుత్వం ఇచ్చే పరిస్థితులు లేవు. నీటి పంపిణీకి అధిక ధరలు పెట్టి ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోలు చేయాల్సి ఉంది. దీంతో స్కీంకు సంబంధించినది కావడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను గాలికొదిలేయడంతో ప్రస్తుతం నీరు సరఫరా జరగడం లేదు. దీంతో ఎత్తిపోతల పథకం మూతవేశారు. ఈ స్కీంకు నీటి సరఫరా జరగాలంటే టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది.



ముండ్లమూరులో దొంగల పాలైన ట్రాన్స్‌ఫార్మర్



మూతేసిన గొట్టిపాటి హనుమంతరావు ఎత్తిపోతల పథకం

చెరువు నిండినా నీటి ఎద్దడే



నిండుగా ఉన్న అట్లపల్లి చెరువు

కురిచేడు: వర్షాకాలంతో పాటు నాగార్జున సాగర్ కాలువకు నీరు పుష్కలంగా ప్రవహిస్తున్నాయి. దీంతో తాగునీటి చెరువుకు నీరు నిత్యం కాలువ నుంచి సరఫరా జరుగుతూ చెరువు తొణికిసలాడుతోంది. కాంట్రాక్టర్ మాత్రం వేసవిలోలా ప్రస్తుతం రోజు మార్చి రోజు నీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చెరువులో నీరు సమృద్ధిగా ఉంటేనే సరఫరా ఇలా జరిగితే రాబోయే వేసవిలో పరిస్థితి ఎలా ఉండబోతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పరిశీలన, సక్రమంగా లేకపోవడంతో కాంట్రాక్టర్ పనితీరు ఇలా ఉంటుందని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల పరిధి ప్రజలు ఎస్ఎస్‌పీ పథకం ద్వారా తాగునీరు వినియోగిస్తున్నారు. మిగిలిన గ్రామాలకు తాగునీటి పథకం పొట్లపాడులో 2009 నిర్మించినా ఆ పథకం నేటికీ సత్ఫలితాలు ఇవ్వలేదు. ఆ పథకం ద్వారా ఒక్క గ్రామానికి కూడా నీరు సరఫరా జరగడం లేదు. అదే సమయంలో మండలంలోని ఆవులమంద, పడమర వీరాయపాలెం గ్రామాలకు రక్షిత నీటి పథకాలు మంజూరు చేసి నిర్మించినా అవి నేటికీ నిరుపయోగంగానే ఉన్నాయి. వాటిని తిరిగి పనిచేసేలా చర్యలు చేపడితే మండలంలోని ఎక్కువ గ్రామాలకు తాగునీటి సమస్యను వేసవిలో కూడా ఎదుర్కొనే అవకాశం ఉంది. స్థానిక పెద్దచెరువు, పడమర నాయుడుపాలెం చెరువు, పెద్దవరం చెరువులను తాగునీటి చెరువులుగా మార్చితే మండల ప్రజలకు వేసవిలోను తాగునీటి ఎద్దడి లేకుండా చేయవచ్చు. ఆ దిశగా అధికారులు సూచనలు చేయకపోవటం హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికైనా స్థానికంగా వున్న పెద్దచెరువును తాగునీటి చెరువుగా మార్చి ఉన్న పథకానికి అనుసంధానం చేసి మిగిలిన రెండు చెరువులను తాగునీటి చెరువులుగా చేస్తే రాబోయే వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఉండే అవకాశం ఉంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



మాట్లాడుతున్న సీఐ రామారావు

దర్శి: సర్కిల్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ రామారావు హెచ్చరించారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామారావు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, వచ్చే పోయే వారిపై జులుం ప్రదర్శిస్తే అరెస్ట్ చేసి కోర్టుకు పెడుతామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, పేకాట, కోడి పందేలు నిర్వహించినా అటువంటి చర్యలను రౌడీ యాక్టివిటీస్‌గా పరిగణిస్తామని హెచ్చరించారు. దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో గతంలో పేకాట ఆడిన వారిని, ఆడించిన వారిని గుర్తించామని, వారి కదలికలపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా మళ్లీ పేకాట ఆడటం, ఆడించడం చేసి పట్టుపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. గ్రామాల్లో నిత్యం మద్యం తాగి పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్న వారిని కూడా కొంతమందిని గుర్తించామన్నారు. అలాంటి వారి ప్రవర్తనలో మార్పు రాకుంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ఖరీఫ్ పంట నమోదు రసీదులు సరిచూసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ముండ్లమూరు (దర్శి): రైతులు ఖరీఫ్ పంట నమోదులో రసీదులను పంట నమోదు పొందిన ప్రతి రైతు సరి చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వేంపాడులో మండల వ్యవసాయాధికారి అధ్యక్షతన ఈ-పంట ఖరీఫ్ 2024 సంబంధించిన తుది జాబితా ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రబీలో రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో నోటిఫైడ్ పంటలైన వరి, శనగ, మినుము, ఎండుమిరప, మొక్కజొన్న, జొన్న పంటలకు ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపల ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 12వ తేదీ నాటికి వరి పంటకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. శనగ, మినుములు, ఎండుమిరప, మొక్కజొన్న, జొన్న పంటలకు డిసెంబర్ 15వ తేదీలోపు గడువు నిర్ణయించినట్లు తెలిపారు. వీఏఏ శోభారాణి, బాలవెంకటయ్య, ఎంపీఈఓ దయాసాగర్ పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్

పెద్దారవీడు: ప్రజల్లో అవగాహనతోనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పెద్దారవీడు పోలీసుస్టేషన్‌లో కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సెమినార్లు, వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశంపై పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి సైబర్ మోసాలపై అవగాహన పెంపొందించుకోవాలని, సైబర్ నేరస్తులపై నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్, బ్యాంకు, వ్యక్తిగత వివరాలు ఎవరికీ వెల్లడించరాదని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాల ఆధారంగా జరిగే మోసాలను సైబర్ నేరాలుగా గుర్తించవచ్చని, సెల్‌ఫోన్‌లో వచ్చే కొత్త మెసెజ్‌లు నొక్కరాదన్నారు. ఏటీఎంలు ఉపయోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాన్నారు. యువత వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులకు పోలీసుల విధుల గురించి వివరంగా వివరించారు. విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశంపై పోటీలు జరిగాయి. అనంతరం వ్యాసరచన, సెమినార్లలో ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రైటర్ నాయక్, పోలీసులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న భూముల సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. మండలంలోని ఇండ్లచెరువు పంచాయతీ పరిధి రాగమక్కపల్లిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి సంబంధించిన భూములకు రెవెన్యూ అధికారులు రీ సర్వే పూర్తి చేశారని, దానిలో ఏ రైతూ తమ పొలం ఇబ్బందులకు గురైందని బాధపడకుండా ఉండటానికి అధికారులు మీ గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి మీ సమస్యలు పరిష్కరిస్తారని తహసీల్దార్ తెలిపారు. రైతుల నుంచి 29 అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను మళ్లీ మీ గ్రామానికి సర్వేయర్లను, రెవెన్యూ సిబ్బందిని పంపించి యజమానితో మాట్లాడి భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎవరైనా ఆన్‌లైన్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటే మ్యూటేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు వీఆర్‌ఓ అందుబాటులో ఉంటారని, తమకు సమస్య తెలియ పరిస్తే భూ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని రైతులకు తహసీల్దార్ రమాదేవి వివరించారు. రీ సర్వే డీటీ నాగార్జునరెడ్డి, సర్వేయర్‌లు దర్బార్ వలి, వెంకట్రావు, వీఆర్‌ఏ ఏసయ్య, రైతులు పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



పుల్లలచెరువులో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని పురుగుమందుల దుకాణాల్లో వ్యవసాయ అధికారుల బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా అంతర్గత తనిఖీ బృందం అధికారి బాలాజీనాయక్, మండల వ్యవసాయ అధికారి జవహర్‌లాల్ నాయక్‌లు పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. దుకాణాల రిజిస్టర్‌లు, బిల్ బుక్స్, ధరల పట్టికలను పరిశీలించారు. అనుమతి ఉన్న కంపెనీ పురుగుమందులనే రైతులకు విక్రయించాలని, తప్పని సరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని వారు దుకాణాదారులను ఆదేశించారు. అనుమతి లేని పురుగు మందులను రైతులకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని దుకాణాదారులను అధికారులు హెచ్చరించారు.

పుల్లలచెరువులో...

పుల్లలచెరువు: ఒంగోలు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారి నిర్మల ఆధ్వర్యంలో మండల కేంద్రం పుల్లలచెరువులో శ్రీరామ ట్రేడర్స్, వేణుగోపాల ట్రేడర్స్, శ్రీవిజయలక్ష్మి ట్రేడర్స్‌లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీరామ ట్రేడర్స్ షాపులో రూ.1,67,150 విలువైన ఎరువులు, రూ.1,50,540 విలువగల పురుగుమందులు, వేణుగోపాల ట్రేడర్స్ షాపులో రూ.1,14,200 విలువైన ఎరువులు, రూ.1,12,30 విలువైన పురుగుమందులు, శ్రీవిజయలక్ష్మి ట్రేడర్స్ షాపులో రూ.1,21,100 విలువైన ఎరువులు, రూ.1,82,560 విలువైన పురుగు మందులు నిల్వ ఉన్నాయని, వాటిని అమ్మకూడదని నిలుపుదల చేశామని ఏఓ తెలిపారు. విజిలెన్స్ సీఐ రవిబాబు, డీసీటీఓ పి.రామారావు, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

దర్శి: వెలుగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్‌లో సీపీఐ నియోజకవర్గ సమితి సమావేశం కురేటి బాలయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్ట్ ప్రకాశం జిల్లాకు వరప్రసాదిని అని చెప్పారు. ఆఖరి దశలో ఉన్న ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ ఈ నెల 28వ తేదీ అన్నీ తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెలుగొండపై చొరవ చూపితే మూడు జిల్లాలకు సాగు, తాగు నీరు అందుతాయన్నారు. ఈ విషయంపై రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం అందించామన్నారు. నియోజకవర్గ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు మండలాలు వెలుగొండ ప్రాజెక్ట్ పరిధిలోకి వస్తాయన్నారు. వెలుగొండ నిధుల కోసం సీపీఐతో కలిసి రావాలని కోరారు. సీపీఐ సీనియర్ నాయకులు వీరాంజనేయులు, సుంకర అంజిరెడ్డి, కె.హనుమంతరావు, జూపల్లి కోటేశ్వరరావు, ఆర్. కరుణానిధి, అరుణమ్మ, రామాంజి, స్టాలిన్ పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతికి పాటుపడటం అభినందనీయం



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పెద్దదోర్నాల: దాతలు నిరు పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటు పడటం అభినందనీయమని ఎంఈఓ మస్తాన్ నాయక్ కొనియాడారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మాపురం, కొత్తూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ షెక్షావలి సమకూర్చిన దుప్పట్లు, ప్లేట్లు, టూత్‌బ్రష్‌లు, వాటర్ బాటిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ సొంత నిధులు వెచ్చించి వారికి అవసరమైన వస్తువులను సమకూర్చటం గొప్ప విషయమన్నారు. పేద విద్యార్థుల కోసం దాతలు ముందుకు వచ్చి వారి తోడ్పాటును అందించాలని కోరారు. ఇలా ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 100 మంది విద్యార్థులకు 40 వేల విలువ చేసే వస్తువులను పంపిణీ చేసిన అనంతరం వారికి మధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. దాత షేక్ షెక్షావలి, ఉపాధ్యాయులు సతానియల్, రెహనాబేగం, రామునాయక్, సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు బాషా, దాసు, సర్దార్, విజయ్, ఇబ్రహీం, నారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు ఎంపికైన కీర్తిలాస్య

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎల్ కీర్తిలాస్య జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చీరాలలో జరుగుతున్న జిల్లా స్థాయి పోటీల్లో షటిల్ సింగల్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 28న రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు కీర్తిలాస్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పీఈటీ ఉమామహేశ్వరిని, విద్యార్థినిని హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీసుస్టేషన్‌పై అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగరాజు

ముండ్లమూరు (దర్శి): పోలీసుస్టేషన్‌లో జరిగే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నాగరాజు సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పోలీసుస్టేషన్‌లో ఉండే విభాగాల వారీగా నిత్యం జరిగే పనుల గురించి, కాన్ఫరెన్స్‌ల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యార్థులకు పోలీసుస్టేషన్‌పై నమ్మకంతో పాటు ఇక్కడ జరిగే విషయాలు తెలుసుకుంటే మంచిదన్నారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు.

గిరిజన గూడేల్లో వైద్యశిబిరం



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న రేంజ్ అధికారి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గిరిజన గూడేల్లో చెంచు గిరిజనులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని నల్లగుంట్ల గూడెం, పోతన్న గూడెం, అయ్యన్నకుంట, కొర్రప్రోలు, పెద్దమంతనాల గూడేలకు చెందిన గిరిజనులకు నల్లగుంట్ల గూడెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ శంకర్‌రెడ్డి, డాక్టర్ కవిత, రంగా వైద్యశాలకు చెందిన గైనకాలజిస్టు డాక్టర్ గౌస్‌మొహిద్దీన్‌లు పాల్గొని గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. ఆ సందర్భంగా వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో 100 మంది గిరిజనులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్లు డాక్టర్ శంకరరెడ్డి తెలిపారు. సబ్ డీఎఫ్ఓ వేణు, కొర్రప్రోలు రేంజి అధికారి ప్రసన్నజ్యోతి, ఫారెస్ట్ సెక్షన్ అధికారి అన్వర్‌బాషా, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల సర్వే



భూములను సర్వే చేస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్: పట్టణ పరిధిలో ఉన్న దళితుల భూములను తహసీల్దార్ చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. కొన్నేళ్లుగా ఈ భూములు తమ పూర్వీకులవని, అయితే 2014 నుంచి 2019 మధ్య కాలంలో టీడీపీ నాయకులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు మార్చుకున్నారని దళిత సంఘ నేత ఐజక్ ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 1475లో ఉన్న 41.50 ఎకరాల భూమిని మార్కాపురం తహసీల్దార్, మండల సర్వేయర్ సంజీవయ్య సమక్షంలో సర్వే చేశారు. శనివారం జేసీ కోర్టులో విచారణకు ఇరువర్గాలు హాజరు కావాలని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఐజక్ మాట్లాడుతూ సర్వే నంబర్ 1475 నుంచి 1485 వరకూ దళితులకు డిప్రెస్ క్లాస్ షరతుల కింద ఈ భూములను కేటాయించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ భూమిపై హక్కుదారులుగా తామే ఉన్నామని, పత్తి, కంది పంటలు సాగు చేస్తున్నామని చెప్పారు. పట్టణానికి చెందిన టీడీపీ నేత 1994లో కృష్ణా జిల్లాకు చెందిన వారితో కుమ్మక్కై దొంగ డాక్యుమెంట్లు సృష్టించి డాక్యుమెంట్ల ఆధారంగా మాపై దాడులు చేశారన్నారు. దళిత భూములపై టీడీపీ నేతలు కన్నేయడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు, టీడీపీ పెద్దలకు, నాయకులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఇరుపార్టీల నేతలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుకుండా మార్కాపురం ట్రాఫిక్ ఎస్సై అహరోన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.